మహిళలకు ఆర్థిక భరోసా



తడికలపూడిలో మహిళా ప్రాంగణం



మగ్గం వర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

- తడికలపూడి ప్రాంగణంలో మహిళలకు శిక్షణ
- పలు వృత్తి విద్యా కోర్సుల్లో తర్ఫీదు

కామవరపుకోట: రాష్ట్ర మహిళా సాధికారత సంస్థ జిల్లాలో నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కామవరపుకోట మండలం తడికలపూడి శివారులో తొమ్మిది ఎకరాలు సువిశాలమైన విస్తీర్ణంలో, సుమారు 200 మంది శిక్షణ పొందేల హాల్, హాస్టల్ వసతి, డైనింగ్ హాల్ వంటి సౌకర్యాలతో, ఆంధ్రప్రదేశ్ మహిళా సాధికారత సహకార ఆర్థిక సంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో, 1988లో బాలల, స్త్రీ శిక్షణ కేంద్రంగా దీనిని ప్రారంభించి సేవలందిస్తున్నారు. తరువాత తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణంగా, దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రంగా, ప్రస్తుతం ఎన్టీఆర్ నైపుణ్య అభివృద్ధి, మహిళా సాధికారత శిక్షణ కేంద్రంగా, జిల్లాలో ప్రతి ఏడాది అనేక మంది నిరుద్యోగ మహిళలకు పలు రంగాల్లో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. తడికలపూడి మహిళా ప్రాంగణంలో డిజైనింగ్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ గార్మెంట్స్, జూట్ ప్రొడక్ట్, బ్లాక్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్, శారీ పెయింటింగ్, కంప్యూటర్, మగ్గం వర్క్ వంటి పలు కోర్సులకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగినులు వృత్తి సామర్థ్యం పెంచుకునేలా, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ప్రాంగణంలో శిక్షణ పొందాలనుకునే మహిళలు, 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన పేద, అనాథ, వితంతు, భర్తచే త్యజింపబడిన, సామాజికంగా వెనకబడిన మహిళలకు, ఆయా కోర్సులకు ఇక్కడ మూడు నెలల శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయంతో పాటు మెటీరియల్ అందజేస్తారు. మహిళలు అన్ని రంగాల్లో ఉద్యోగ, ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో, గత నాలుగు సంవత్సరాల నుంచి ఈ మహిళా ప్రాంగణంలో 3,644 మంది మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన శిక్షణ అందించారు.

స్వయం ఉపాధి పొందుతున్నారు



మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేదిగా నిరంతరం ఈ ప్రాంగణంలో మెరుగైన రకరకాల శిక్షణ ఇచ్చి, అన్ని రంగాల్లో మహిళల తోడ్పాటుకు కృషి చేస్తున్నాం. అంతే కాకుండా ఉద్యోగినుల వృత్తి సామర్థ్యం పెంచుకునేలా ఆశ వర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇక్కడ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తాం. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు, ప్రభుత్వం అందించిన ప్రోత్సాహాలతో, స్వయంగా ఆయా వృత్తుల్లో షాపులు ప్రారంభించి, ఉపాధి పొందుతూ, ఆర్థికంగా నిలబడుతున్నారు.

–బి.రిబ్కా శామ్యూల్, ప్రాంగణం అధికారి, తడికలపూడి

ప్రస్తుతం ఈ ప్రాంగణంలో మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ రెబ్కా శామ్యూల్ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ కార్యక్రమాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద

మహిళా ప్రాంగణంలో ఉచితంగా కల్పిస్తున్న శిక్షణా కార్యక్రమాలను నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద తెలిపారు. బుధవారం తడికలపూడి మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ఈ శిక్షణా కార్యక్రమాలు చేపడుతుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేయడంతో పాటు స్వయం ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె తెలిపారు.

క్లుప్తంగా

శ్రీవారి పథకాలకు విరాళం



దాత సుమంత్ కుమార్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన, విమానగోపుర స్వర్ణమయ పథకాలకు ఒక భక్తుడు బుధవారం రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. రాజమండ్రికి చెందిన వీఎస్ సుమంత్ కుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కార్యాలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షలు, విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ.లక్ష, జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకములు నిర్వహించారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ



చెస్‌లో విజేతలను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: రోటరీ క్లబ్‌లో చెస్ విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ ప్లేయర్లు ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన క్లాసికల్ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనపరచి మల్లంపల్లి కుషాంక్ 1648 క్లాసికల్ చెస్ రేటింగ్ సాధించి శ్రీవిశ్వ ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్ ప్లేయర్‌గా, పెన్మత్స సాథిక్ వర్మ 1406 క్లాసికల్ చెస్ రేటింగ్ సాధించి ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్ ప్లేయర్‌గా నిలిచినట్లు అకాడమీ డైరెక్టర్ అయినపర్తి సరళామాధవి తెలిపారు. ఈ సందర్భంగా చెస్ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఎ.చంద్రశేఖర్ మాస్టారు, తల్లిదండ్రులు, ప్లేయర్లు పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స



సాయిస్ఫూర్తి ఆసుపత్రిలో మహిళ కడుపులో నుంచి కణితిని తొలగిస్తున్న వైద్యులు

జంగారెడ్డిగూడెం: సాయి స్ఫూర్తి మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిలో బుధవారం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. పోలవరం గ్రామానికి చెందిన స్వర్ణ మాధురి కడుపు నొప్పితో బాధపడుతూ డాక్టర్ సోనికాను సంప్రదించారు. వైద్య పరీక్షలు, స్కానింగ్ అనంతరం మాధురి కడుపులో కణితి (కాంప్లెక్స్ పోవిరియన్ సిస్టమ్) ఉన్నట్లు గుర్తించారు. మాధురికి శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపు నుంచి సుమారు ఏడు కిలోలు ఉన్న కణితి ను బయటకు తీశారు. శస్త్ర చికిత్స అనంతరం మాధురి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. శస్త్ర చికిత్స విజవంతంగా నిర్వహించిన డాక్టర్ సోనికా, ఇతర వైద్యులను పలువురు కొనియాడారు.

సేంద్రియ ఎరువులను వాడాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ అధికారులు

లింగపాలెం: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని వాడి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారి ఎ.మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం పోలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొణిజర్ల గ్రామంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతేనన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రమేష్, పలు శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పది'లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాములు నాయక్

బుట్టాయగూడెం: మార్చిలో నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా తయారు చేయాలని ఐటీడీఏ పీఓ కేతావతు రాములు నాయక్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను, వారికి బోధిస్తున్న పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వసతి గృహంలో విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. తరచూ విద్యార్థులకు స్లిప్ టెస్టులు పెట్టి వారిలో పరీక్షల పట్ల భయాన్ని తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జలపాతాన్ని ప్లాస్టిక్ రహితం చేస్తాం



సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

బుట్టాయగూడెం: మండలంలోని ముంజులూరు అటవీ ప్రాంతంలో గల పర్యాటక ప్రదేశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కొండరెడ్డి గిరిజనులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక సమావేశంలో సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి, న్యూడెమోక్రసీ నాయకులు పోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఎన్నో అందమైన పర్యాటక ప్రాంతాలు, వ్యూ పాయింట్లు, జలపాతాలు ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు అన్ని ప్రాంతాల నుంచి ఎక్కువ పసంఖ్యలో వస్తున్నారని అయితే వారు ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా వినియోగించి, అటవీ ప్రాతంలోనే వదిలి వేసున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా అడవుల్లో వదిలి వేయడం వల్ల అటు ప్రకృతికి, ఇటు వన్య ప్రాణులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామం నుంచి జలపాతం వరకూ దట్టమైన అడవిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దారి తెలియని వారి కోసం గైడ్‌ను ఏర్పాటు చేశారు. ఇతడు పర్యాటకులకు సహాయంగా ఉంటాడన్నారు.

గర్భిణి మృతిపై విచారణ చేయాలి



ఐటీడీఏ వద్ద మాట్లాడుతున్న ఆదివాసీ భారత మహాసభ నాయకులు

బుట్టాయగూడెం: ఇటీవల సకాలంలో వైద్యం అందక మృతి చెందిన తొమ్మిది నెలల గర్భిణీ మధుబాల, శిశువు మృతి సంఘటనపై విచారణ చేసి, న్యాయం చేయాలని ఆదివాసీ భారత మహాసభ రాష్ట్ర నాయకులు చుండ్రు రామిరెడ్డి, మడకం రామన్న డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బుధవారం ఆ సంఘ నాయకుల బృందం ఏపీఓ పీవీఎస్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు ఐటీడీఏ వద్ద మాట్లాడుతూ గర్భిణి మధుబాలను జ్వరం వచ్చి వెన్నుపోటు వస్తున్న క్రమంలో నందాపురం ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడి నుంచి బుట్టాయగూడెం, అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం, తదుపరి ఏలూరు తీసుకెళ్లి పరీక్షలు చేసిన అనంతరం విజయవాడ రిఫర్ చేశారన్నారు. అక్కడ కొన్ని గంటల తర్వాత ఆపరేషన్ చేసి చనిపోయిన బిడ్డను బయటకు తీశారని చెప్పారు. అయితే కొద్దిసేపటికి తల్లి మధుబాల కూడా మృతి చెందిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తల్లి, బిడ్డ మృతి చెందారని ఆరోపించారు. కార్యక్రమంలో మృతురాలి భర్త అబ్బాయిరెడ్డి, సర్పంచ్ అద్దెల సీతారామిరెడ్డి, బి.రామ్‌కుమార్, వి.రాజిరెడ్డి, మహమ్మద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

కలప రవాణాకు రైతుల వినతి

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు సాగులో ఉపయోగించే కలప రవాణాకు అటవీశాఖ వేలం నిర్వహించి అనుమతులు ఇప్పించాలంటూ రైతులు బుధవారం వినతిపత్రం అందజేసినట్లు రేంజర్ ఎ.శివరామకృష్ణ పేర్కొన్నారు.కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఉన్న రైతులు కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి చేరుకుని తమకు వినతిపత్రం అందజేశారన్నారు.ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని రేంజర్ తెలిపారు.

బడ్జెట్ ప్రతుల దహనం

చింతలపూడి: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి తీరని అన్యాయం జరిగిందని బడ్జెట్ ప్రతులను ఏపీ రైతు సంఘం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. పంటలకు కనీస మద్దతు ధర లేదని స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుకు నోచుకోలేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారి సోమశేఖర్ ఏపీ సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ విమర్శించారు. కంచర్ల గురవయ్య, జంగా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తపస్య పేరుతో స్కూల్‌కు గుర్తింపు ఇవ్వలేదు



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖ అధికారి రామన్నదొర

కామవరపుకోట: స్థానిక కొత్తూరులో తపస్య స్కూలు పేరుతో ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదని జంగారెడ్డిగూడెం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.రామన్నదొర తెలిపారు. కొత్తూరులో తపస్య స్కూల్ పేరుతో దరఖాస్తు చేసుకోగా బుధవారం అక్కడ మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. పాఠశాల నిర్వహణకు సరైన సదుపాయాలు లేవని, సరిఫికెట్లు లేవని గుర్తించామన్నారు. అనుమతులకు కావలసిన సర్టిఫికెట్లు లేని కారణంగా ఫైల్ రిజెక్ట్ చేశామన్నారు. 2024–2025 సంవత్సరానికి తపస్య స్కూల్ పేరుతో ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. పాఠశాల నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓలు డి.సుబ్బారావు, సీహెచ్ ప్రకాంత్‌కుమార్, కానిస్టేబుల్ నాగార్జున పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను సంరక్షించాలి

పోలవరం రూరల్: 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని గిరిజనులకు స్పష్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఇటికలకోటలో సీపీఎం మండల విస్తృత స్థాయి సమావేశం మడివి చలపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన చట్టాలను సంరక్షించాలన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



జంగారెడ్డిగూడెంలో పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

బుట్టాయగూడెం: పొగాకు రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా అధిక లాభాలు సాధించొచ్చని వేలం నిర్వహణ అధికారి బి.శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని ముప్పినవారిగూడెంలో బోర్డు సిబ్బంది పొగాకు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకు వెడల్పు, క్యూరింగ్, గ్రేడింగ్ విధానాలపై రైతులు పలు, సలహాలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తిపై దృష్టి పెట్టాలన్నారు. పొగాకు క్యూరింగ్ దశలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొగాకు రైతులు ఎగుమతికి ఆమోదమయ్యే పురుగు మందులు, అవశేషాలు లేని పొగాకు పంటను మాత్రమే పండించాలన్నారు.

వ్యర్థ పదార్థాలను క్షేత్ర స్థాయిలోనే తొలగించాలి

జంగారెడ్డిగూడెం: వ్యర్థ పదార్థాలను క్షేత్ర స్థాయిలోనే తొలగించాలని జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం–1 నిర్వహణాధికారి బి.శ్రీహరి అన్నారు. బుధవారం వేలం కేంద్రం పరిధిలోని మైసన్నగూడెం, ముప్పినవారిగూడెం ప్రాంతాల్లో బోర్డు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వర్జీనియా రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పొగాకులోని వ్యర్థ పదార్థాలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి రైతులు వాటిని తొలగించాలన్నారు. ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్ విధానాలపై పొగాకు రైతులకు అవగాహన కల్పించారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకొని వ్యర్థ పదార్థాలను వాటిలో వేయాలన్నారు. పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే కొట్టాలన్నారు. రైతు సోదరులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తి మీద దృష్టి పెట్టాలని సూచించారు. పొగాకు పంటలో ప్రస్తుతం ఎటువంటి పురుగులు, తెగుళ్లు లేవని మందులు వాడనవసరం లేదని తెలియజేశారు. అవసరం అయినచో సిఫారసు చేసిన మందులు మాత్రమే వాడాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని రాళ్లకుంటలో ఒక పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.19,400, 10 బైక్‌లు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పోలవరం మండలం వింజరం గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మడకం దేవరాజ్ మోటార్ సైకిల్‌పై నాటు సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. మోటార్ సైకిల్, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై జి.సునీల్ కుమార్, హెచ్‌సీ పి.సునీల్ కుమార్, కానిస్టేబుళ్లు ఎ.రాజేష్, బి.వెంకన్నబాబు, పద్మారావు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

జంగారెడ్డిగూడెం: గీత కులాలు కోసం మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంచినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ జంగారెడ్డిగూడెం పరిధిలో మున్సిపాలిటీ, మండలంలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుల్లో భాగంగా మున్సిపాలిటీకి శెట్టిబలిజ, రూరల్‌కు గౌడ కులాల వారికి కేటాయించారన్నారు. వీటికి సంబంధించిన దరఖాస్తు తేదీని పొడిగించినట్లు చెప్పారు. దరఖాస్తులు ఎనిమిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ స్వీకరించబడతాయని, దరఖాస్తు రుసుం రూ.2 లక్షలని తెలిపారు. పదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు చలసాని గార్డెన్స్ మినీ బైపాస్, ఏలూరులో డ్రా తీయబడునని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పదవీ విరమణ చేసిన ఉద్యోగిని ఇరిగేషన్ అధికారులు సన్మానించారు. పోలవరం ప్రాజెక్టు డివిజన్–2లో టెక్నికల్ అధికారిగా పని చేస్తున్న గుత్తుల గణేశ్వరరావు గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈయనను ఈఈ బాలకృష్ణమూర్తి, అధికారులు శాలువా కప్పి సన్మానించారు. గణేశ్వరరావు 34 సంవత్సరాలుగా జలవనరుల శాఖలో పని చేశారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి ఆచూకీ లేదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ఓ పాఠశాలలో పని చేస్తున్న ఒక ఉపాధ్యాయుని ఆచూకీ గతేడాది ఏప్రిల్ నుంచి తెలియడం లేదని వెంటనే సదరు ఉపాధ్యాయుడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వేలేరుపాడు మండలం రుద్రమకోట ఎంపీపీ స్కూల్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న మల్లం శ్రీనివాసరావు గతేడాది ఏప్రిల్ 8 నుంచి విధులకు గైర్హాజరౌతున్నారని తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు ఎక్కడ ఉన్నది, ఏం చేస్తున్నది తెలియడం లేదని వేలేరుపాడు ఎంఈఓ తెలిపారని పేర్కొన్నారు. గత సెప్టెంబర్ 25న శ్రీనివాసరావుకు షోకాజు నోటీసు జారీ చేసినప్పటికీ ఆయన నుంచి ఎటువంటి వవరణ రాలేదని తెలిపారు. డీఈఓ కార్యాలయంలో వ్యక్తిగతంగా నిర్దేత గడువులోగా రిపోర్ట్ చేయకుంటే సేవల నుంచి తీసివేస్తామని స్పష్టం చేశారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

కుక్కునూరు: మండలాన్ని యూనిట్‌గా తీసుకొని త్వరితగతిన పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు పరామర్శ



బాలరాజును పరామర్శించి ఆయన తల్లి మల్లమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కారుమూరి

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మాజీ మంత్రివర్యులు కారుమూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించి ఆయన కుటుబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాలరాజు తల్లి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా శాసన మండలి పక్షనేత బొత్స సత్యనారాయణ బాలరాజును ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ బాలరాజును, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు బాలరాజును పరామర్శించారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

చింతలపూడి: కార్మిక చట్టాలను హరించి, నూతన చట్టాలను తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసిందని సీఐటీయూ నాయకులు అన్నారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పుష్పరాణి, బి.సరళ, పి.వరలక్ష్మి, పద్మ, చంద్రకుమారి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సరోజినీ, మాణిక్యం, సరళ, హేమలత, చెన్నకేసరి, సీతా మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకు భంగం

కొయ్యలగూడెం: లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో మెయిన్ సెంటర్‌లో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ లేబర్ కోడ్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్.శివకుమార్, కె.సీతారాముడు, సీహెచ్ మరిడియా, పి.తమ్మారావు, కె.శ్యామల, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆందోళన

టి.నరసాపురం: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు గుడెల్లి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజా సంపదను కార్పొరేటర్లకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మడకం సుధారాణి, అనుమోలు మురళి, మడకం కుమారి, సోయం భవాని, కుంజ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

కుక్కునూరు: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు ప్రధాన సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, సరియం హరినాద్, అన్నపూర్ణ, మాధవి, రమణ, దుర్గ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.